సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం : 31 : అక్టోబర్ : 2023



సోమశిలలో 30.177 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 30.177 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 968 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.63,150
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,702
3శాతం జీఎస్టీతో	రూ.5,873
నవర (8గ్రా)	రూ.46,984

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0 /26.2

సోమవారం గాలిలో తేమ 95 శాతం ఉంది. జిల్లావ్యాప్తంగా పలుచోట్ల వర్షం కురిసింది. మంగళవారం కూడా జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.


వింజమూరులోని చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న నేతలు


సామాజిక సాధికార యాత్రలో ప్రజలతో కలిసి నడుస్తున్న నేతలు


దుత్తలూరులో మహానేత వైఎస్సార్‌కు నివాళులర్పిస్తూ..


వింజమూరులోని జెడ్పీ బాలికల హైస్కూల్లో విద్యార్థినులతో నేతలు

సామాజిక నీరాజనం

సామాజిక సాధికార యాత్రకు జనం జేజేలు పలికారు. వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు చేపట్టిన ఈ బస్సు యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. వింజమూరులో అట్టహాసంగా ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సామాజిక యాత్ర జరిగిన ఉదయగిరి, వింజమూరు పట్టణాలు జనసంద్రమయ్యాయి.

జనసంద్రమైన ఉదయగిరి, వింజమూరు

- వైఎస్సార్‌సీపీ బస్సు యాత్రకు అపూర్వ స్వాగతం
- స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఉదయగిరి నియోజకవర్గంలో సోమవారం జరిగిన వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతమైంది. ఈ యాత్రలో మంత్రులు, ప్రజాప్రతినిధులు బడుగు, బలహీన వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును, రాష్ట్ర ప్రభుత్వం అందించిన సాయాన్ని వివరిస్తుంటే ఆయా వర్గాల ప్రజలు తమ జీవితాల్లో వచ్చిన మార్పును గుర్తు చేసుకుని కరతాళ ధ్వనులతో కృతజ్ఞతలు తెలిపారు. పెత్తందారులు, పేదల మధ్య జరుగుతున్న కురుక్షేత్ర యుద్ధంలో వైఎస్సార్‌సీపీ మరోసారి విజయం సాధించడం తథ్యమని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని నేతలు పిలుపునిచ్చారు.



ఉదయగిరి బహిరంగ సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, వేదికపై డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీలు వేమిరెడ్డి, బీద, ఎమ్మెల్యే అనిల్, ఉదయగిరి నేత రాజారెడ్డి, పాల్గొన్న జనవాహిని

వింజమూరులో విజయవంతం

సామాజిక సాధికార యాత్ర ప్రారంభమైన వింజమూరు పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయం వద్దకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, ప్రజాప్రతినిధులు వేలాదిగా స్వచ్ఛందంగా తరలివచ్చారు. ఈ యాత్రకు విచ్చేసిన వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి, ఉప ముఖ్యమంత్రులు కె.నారాయణస్వామి, అంజాద్‌బాషా, రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, నెల్లూరు మేయర్ పొట్లూరు స్రవంతి, డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్ తదితరులకు వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. ముందుగా చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామాజిక సాధికారిక యాత్ర అట్టహాసంగా ప్రారంభమైంది. చెన్నకేశవస్వామి ఆలయం నుంచి బంగ్లా సెంటర్ వరకు పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు. అభిమాన నేతలపై పూల వర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. డప్పు వాయిద్యాలు, కోలాట ప్రదర్శనలు, డీజేల నడుమ రెండు గంటలపాటు ఈ పాదయాత్ర కొనసాగింది. మార్గమధ్యంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలలను నాయకులు సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. స్థానిక బంగ్లా సెంటర్‌లోని దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వింజమూరు సమీపంలోని జాగీరువనం వద్ద తటస్థులు, విద్యావంతులతో నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

దుత్తలూరు.. ప్రజా హోరు

సామాజిక సాధికార బస్సు యాత్ర దుత్తలూరుకు చేరుకోగానే ఆ ప్రాంత ప్రజలు వేలాదిగా తరలివచ్చి నేతలకు అపూర్వ స్వాగతం పలికారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రులు అంజాద్‌బాషా, నారాయణస్వామిలతోపాటు రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు తదితర నేతలకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికి గజమాలతో సన్మానించారు. అనంతరం దుత్తలూరు సెంటర్ నుంచి బైక్‌లు, కార్లతో ర్యాలీగా ఉదయగిరికి చేరుకున్నారు.

ఉదయగిరిలో జన ఉప్పెన

ఉదయగిరిలో సామాజిక సాధికార బస్సు యాత్రకు జనం ఉప్పెనలా తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. స్థానిక ట్యాంక్‌బండ్ నుంచి సభా ప్రాంగణం జెడ్పీ హైస్కూల్ వరకు నేతల పాదయాత్ర కొనసాగింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు చేసిన ఈ పాదయాత్రకు అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు. జై జగనన్న.. జైజై జగనన్న అనే నినాదాలు హోరెత్తాయి. కార్యక్రమంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయండి

- రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి

వింజమూరు(ఉదయగిరి): వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పోటీ చేస్తారని, వారిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. వింజమూరులోని జాగీరువనం వద్ద తటస్థులు, విద్యావంతులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో పేదలకు అత్యధికంగా ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు పక్కాగృహాలు మంజూరు చేశారని గుర్తుచేశారు. త్వరలోనే రాష్ట్రంలో రహదారులను పూర్తిస్థాయిలో మెరుగుపరుస్తామన్నారు. ప్రజలకు ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని, తమ సాధకబాధకాలను నేరుగా వారికి తెలుపుకొని పరిష్కరించుకోవచ్చని తెలిపారు. వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన ప్రాధాన్యం ఉంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును ప్రజలకు వివరించాలని సూచించారు. 2024 ఎన్నికల్లో వై నాట్ 175 లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.


మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు


ఉదయగిరిలోని వేదికపై ఉప ముఖ్యమంత్రులు, ఎంపీలు, రాజారెడ్డి


బహిరంగ సభా వేదిక వద్ద ఎంపీ విజయసాయిరెడ్డి తదితరులు


వింజమూరులో సామాజిక సాధికార యాత్రలో మాట్లాడుతున్న వేమిరెడ్డి


మేకపాటి రాజారెడ్డితో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తదితరులు


రైతన్నను ఆప్యాయంగా పలకరిస్తూ..


ఫ్యాన్‌తో సందడి చేస్తున్న అభిమాని

న్యూస్‌రీల్

త్వరలో ఐఏబీ సమావేశం

- కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): రైతుల అభ్యర్థన మేరకు నీటి విడుదలపై నిర్ణయం తీసుకునేందుకు త్వరలో సాగునీటి సలహామండలి(ఐఏబీ) సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో పంట పొలాలకు సాగునీరు అందించాలని రైతుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ మేరకు స్పందించిన కలెక్టర్ తాగునీటి అవసరాలు, ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాగునీటి సలహామండలి నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

కార్తీక మాసంలో ప్రత్యేక బస్సులు

నెల్లూరు సిటీ: కార్తీక మాసం సోమవారాల్లో పంచారామాల దర్శనం కోసం ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా రవాణాశాఖ అధికారి పీవీ శేషయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. అమరావతిలోని అమరారామం, భీమవరంలోని సోమేశ్వరారామం, పాలకొల్లులోని క్షీరారామం, ద్రాక్షారామంలోని భీమేశ్వరారామం, సామర్లకోటలోని కోమరారామం ప్రాంతాలకు నెల్లూరు ప్రధాన బస్టాండ్ నుంచి ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు బస్సులు బయలుదేరి సోమవారం పంచారామ క్షేత్రాలకు చేరుకుంటాయని తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటలకు తిరిగి నెల్లూరుకు చేరుకుంటాయని తెలిపారు. నవంబర్ 9 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు ప్రతి ఆదివారం బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పాడిరైతులకు అండగా..

పాడి రైతుల అభ్యున్నతికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే గ్రామాల్లో అమూల్ పాలసేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి పాడి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కృషి చేసిన ప్రభుత్వం ప్రస్తుతం కృత్రిమ పద్ధతిలో ఇంజక్షన్ల ద్వారా పెయ్యదూడల ఉత్పత్తికి శ్రీకారం చుట్టింది. తద్వారా పాడి పరిశ్రమను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంది.

పెయ్యదూడల ఉత్పత్తికి ప్రభుత్వం చర్యలు

- కృత్రిమ గర్భధారణ పద్ధతిలో పిండోత్పత్తి
- అందుబాటులో 6 వేల డోసుల ఇంజక్షన్లు



కోవూరు: ఆవులు, గేదెలు గతంలో చూడి కట్టాలంటే ఎద్దులు, దున్నలపై ఆధారపడాల్సివచ్చేది. తరువాత కృత్రిమ గర్భధారణ(సార్టెడ్ సెమన్) ఇంజక్షన్లు అందుబాటులోకి వచ్చాయి. వీటి ద్వారా పశువు గర్భం దాల్చి ఏదో ఒక దూడకు జన్మనిస్తే చాలని పాడి రైతులు అనుకునేవారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. పెయ్యదూడ కావాలంటే ప్రత్యేకంగా కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. పాడి పశువులకు పెయ్యదూడలు పుట్టాలి.. రైతన్నకు లక్ష్మీకళ రావాలి.. అనే నినాదంతో ప్రభుత్వం పెయ్యదూడల ఉత్పత్తి పథకాన్ని రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో అందుబాటులోకి తీసుకువచ్చింది. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా నవంబర్ ఒకటో తేదీ నుంచి పాడి పశువులకు పెయ్యదూడలు(ఆడదూడలు) పుట్టేలా ఇంజక్షన్లు వేసే ప్రక్రియ అమలు చేయనుంది.



కృత్రిమ గర్భధారణ

రైతులకు పాడి పంటలు రెండు కళ్లు. ఇవి ఒకదానిపై మరొకటి ఆధారపడి రైతుల అభివృద్ధికి దోహదపడతాయి. కాలానుగుణంగా వచ్చిన మార్పుల వల్ల వ్యవసాయంలో యాంత్రీకరణకు ప్రాధాన్యం సంతరించుకోవడంతో పాడి పరిశ్రమలో మగజాతి పశువులకు ప్రాధాన్యం తగ్గింది. దీంతో ప్రతి రైతు తమ ఇంట పెయ్యదూడలు పుడితే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని భావిస్తున్నారు. వారి ఆశలను నిజం చేసేందుకు ప్రభుత్వం పెయ్యదూడల జననానికి కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. జిల్లా వ్యాప్తంగా పాడి పశువులకు ఈ ఇంజక్షన్లు అందించేలా ఏర్పాట్లు చేసింది.

జిల్లాలో..	
ప్రాంతీయ పశువైద్య ఆస్పత్రులు	- 23
పశు వైద్యశాలలు	- 144
గ్రామీణ పశువైద్య కేంద్రాలు	- 79
గోపాలమిత్ర కేంద్రాలు	- 108

అందుబాటులో 6 వేల డోసులు

పాడి పశువుల కృత్రిమ గర్భధారణకు సంబంధించి జిల్లావ్యాప్తంగా 6 వేల డోసుల ఇంజక్షన్లు అందుబాటులో ఉంచామని పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపారు. వీటిని ఆయా పశువైద్య కేంద్రాల వద్ద పాడి రైతులు పొందవచ్చని తెలిపారు. కావలి డివిజన్‌లో 2,100 డోసులు, నెల్లూరు డివిజన్‌లో 2,350 డోసులు, కందుకూరు డివిజన్‌లో 1,550 డోసులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పెయ్యదూడల ఉత్పత్తికి సంబంధించి రూ.500 చెల్లించి ఈ ఇంజక్షన్ వేయించుకోవచ్చు. ఈ ఇంజక్షన్ ద్వారా మేలు జాతి పెయ్యదూడలు జన్మించి పాడి పరిశ్రమ మరింతగా అభివృద్ధి చెందనుంది.


సార్టెడ్ సెమన్ నిల్వ చేసే కాపర్ క్యాన్లు

ఫలించకపోతే నగదు వాపసు



పెయ్యదూడలు కావాల్సిన రైతులు రూ.500 చెల్లించి ఆవుకు గానీ, గేదెకు గానీ ఇంజక్షన్ వేయించుకోవచ్చు. ఒకసారి తప్పితే రెండోసారి ఇంజక్షన్ వేస్తారు. వైద్యుల సూచనల మేరకు వాటిని పర్యవేక్షించాలి. అప్పటికీ గర్భం నిలబడకపోతే నగదు వాపసు ఇవ్వడం జరుగుతుంది. ఒకవేళ మగదూడ జన్మిస్తే సంబంధిత రైతుకు రూ.250 తిరిగి వైద్యులు అందజేస్తారు.

– మహేశ్వరుడు, జేడీ, వ్యవసాయశాఖ

చక్కని అవకాశం



పాడి రైతులకు ఇదొక చక్కని అవకాశం. తమ పశువులు ఎదకు వస్తే తప్పనిసరిగా పెయ్యదూడల పిండోత్పత్తి ఇంజక్షన్లు వేయించుకొని పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకునే దిశగా ఆలోచించాలి. ఇలా చేయడం ద్వారా పాడి పశువుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

– గొల్లపల్లి విజయకుమార్, చైర్మన్, డీఎల్‌డీఏ

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని పాడి రైతులంతా పెయ్యదూడల జననానికి సంబంధించిన ఇంజక్షన్లను ఎదకు వచ్చిన ఆవులు, గేదెలకు వేయించాలి. జిల్లాలో 6 వేల కృత్రిమ గర్భధారణ డోసులు అందుబాటులో ఉన్నాయి. వీటిని నవంబర్ ఒకటో తేదీ నుంచి ఆయా పశు వైద్య కేంద్రాల్లో అందించనున్నారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ సోమయ్య, ఈడీ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ

మాదక ద్రవ్యాల కట్టడికి చర్యలు

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి


మాట్లాడుతున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): మత్తు, మాదక ద్రవ్యాల కట్టడికి పోలీస్, సెబ్ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి ఆదేశించారు. సోమవారం నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో నార్కోటిక్ కోఆర్డినేషన్ సమన్వయ సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్పీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిఘా వ్యవస్థను పటిష్టం చేసి మాదక ద్రవ్యాలు, నిషేధిత మత్తు పదార్థాల అమ్మకం, నిల్వ, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. గంజాయి అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో కట్టడిచేసేందుకు నిరంతర తనిఖీలు చేపట్టాలన్నారు. గంజాయి సరఫరాదారులు, స్థానిక విక్రేతలు, సేవించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. మత్తు, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన తరగతులు నిర్వహించాలన్నారు. జిల్లాలోని ప్రధాన కూడళ్లు, విద్యాసంస్థల్లో 14500 టోల్‌ఫ్రీ నంబర్, మత్తు, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై ప్రచురించిన హోర్డింగులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. ఏఎస్పీ డీ హిమవతి గంజాయి కేసుల్లో నిందితుల అరెస్ట్, స్వాధీనం చేసుకున్న గంజాయి వివరాలతో పాటు కట్టడికి తీసుకుంటున్న చర్యలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక, సెబ్ అధికారి రవికుమార్, డీఎంహెచ్ఓ పెంచలయ్య, కోస్ట్‌గార్డ్ కమాండెంట్, అగ్రికల్చర్ జేడీ, విద్యాశాఖ, టెర్రిటోరియల్ ఫారెస్ట్ అధికారులు, కృష్ణపట్నంపోర్టు సీఐఓ, ఇంటెలిజెన్స్, సబ్‌డివిజనల్, సర్కిల్ పోలీసు, ఎస్ఈబీ అధికారులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద నలిగి బాలుడి మృతి

కలువాయి: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద నలిగి ఓ బాలుడు మృతి చెందిన ఘటన కలువాయి మండలం వెరుబొట్లపల్లి ఎస్సీ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన తూమాటి ప్రవీణ్(6) అనే బాలుడు ఆడుకుంటూ ట్రాక్టర్ కిందకు వెళ్లాడు. అది గమనించని డ్రైవర్ ట్రాక్టర్‌ను ముందుకు కదలించడంతో వెనుక టైరు కింద నలిగి ప్రవీణ్ మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లిదండ్రులు లక్ష్మమ్మ, చిన్న దంపతులు విషాదంలో మునిగారు. విషయం తెలుసుకున్న కలువాయి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సామాజిక న్యాయం

• గత ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఓటు బ్యాంకుగా చూశాయి
• మైనార్టీని డిప్యూటీ సీఎంను చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే
• వ్యవస్థలను మేనేజ్ చేసింది చంద్రబాబే
• పురందేశ్వరి టీడీపీకి అధ్యక్షురాలిగా పనిచేస్తున్నట్లుగా ఉంది
• సామాజిక సాధికార యాత్ర సందర్భంగా మీడియాతో డిప్యూటీ సీఎంలు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కే నారాయణస్వామి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: గత ప్రభుత్వాలు వెనుకబడిన వర్గాలను ఓటు బ్యాంకుగా చూశాయే తప్ప సామాజిక న్యాయం పాటించలేదని, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు సముచిత స్థానం లభించి సామాజిక న్యాయం జరిగిందని డిప్యూటీ సీఎంలు అంజాద్‌బాషా, నారాయణస్వామితో పాటు రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. సోమవారం వారు జిల్లాలోని వింజమూరులో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్రలో భాగంగా మీడియాతో మాట్లాడారు.

సామాజిక న్యాయం అమలు ఘనత సీఎం జగన్‌దే

• అంజాద్‌బాషా, డిప్యూటీ సీఎం

దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తరువాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సామాజిక న్యాయం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణించాయని తెలిపారు. కానీ మన ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. 11 మంది బీసీలు, ఐదుగురు ఎస్సీలు, ఒక ఎస్టీకి మంత్రివర్గంలో స్థానం కల్పించడంతో పాటు మైనార్టీ వర్గానికి చెందిన తనతో పాటు ఎస్సీను డిప్యూటీ సీఎంలను చేసి సీఎం వైఎస్ జగన్ సముచిత స్థానం కల్పించారన్నారు. వెనుకబడిన తరగతులను రాజ్యాధికార దిశగా తీసుకెళుతున్న సీఎం అభినందనీయుడన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో జరిగిన న్యాయాన్ని ప్రజలకు వివరించడంలో భాగంగా సామాజిక, సాధికారిత యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి అడుగడుగునా జనం నీరాజనాలు పడుతున్నారన్నారు.

వైఎస్సార్‌సీపీలోనే బీసీలకు ప్రాధాన్యం

• బీద మస్తాన్‌రావు, రాజ్యసభ సభ్యుడు

వైఎస్సార్‌సీపీలోనే బీసీలకు అధిక ప్రాధాన్యం కల్పించడం జరిగిందని ఎంపీ బీద పేర్కొన్నారు. బీసీలు వెన్నుదన్ను అని చెప్పుకుంటున్న టీడీపీ ఓట్లు వేయించుకున్న తరువాత పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. దానికి నిదర్శనం తానేనని, టీడీపీలో ఎంపీగా పోటీ చేసిన అనంతరం తనకు ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. తనను రాజ్యసభ సభ్యుడిగా చేసినందుకు సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటానన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నాలుగు రాజ్యసభ స్థానాల్లో రెండింటిని బీసీలకు కేటాయించడం సీఎం వైఎస్ జగన్‌కు వారి పట్ల ఉన్న ప్రేమకు నిదర్శనమన్నారు.

నరరూప రాక్షసుడు చంద్రబాబు

• కే నారాయణస్వామి, డిప్యూటీ సీఎం

నమ్మిన వాళ్లకు నమ్మకద్రోహం చేసి వెన్నుపోట్లు పొడుస్తూ రాష్ట్రంలో అరాచక పాలన సాగించిన నరరూప రాక్షసుడు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు. అవినీతి స్కాంలో జైలులో ఉన్న చంద్రబాబు ఇప్పటికీ వ్యవస్థలను తప్పుదోవ పట్టించడానికి డ్రామాలు ఆడుతున్నాడన్నారు. చంద్రబాబు సతీమణి 'నిజం గెలవాలి' అని ప్రజల్లోకెళ్లడం విడ్డూరంగా ఉంది. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి టీడీపీని లాక్కోవడం, వైఎస్సార్‌సీపీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి మంత్రి పదవులు కట్టబెట్టడం వంటి నీచపు పనులు చేసిన చంద్రబాబు నుంచి నిజాలు రాబట్టాలన్నారు. బీజేపీ రాష్ట్రాధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి బీజేపీకి అధ్యక్షురాలా..టీడీపీకి అధ్యక్షురాలా అని అర్థం కావడం లేదన్నారు. చంద్రబాబును స్వయానా ప్రధాని నరేంద్రమోదీ నమ్మకద్రోహి అని అన్నారని, అలాంటి వ్యక్తిని పురందేశ్వరి వెనకేసుకురావడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఎల్లో మీడియాకు చంద్రబాబు అవినీతి, రామోజీరావు మార్గదర్శిలో జరిగిన అవినీతిని ప్రజలకు వివరించే దమ్ము ఉందాని ప్రశ్నించారు. దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ 2019లో చంద్రబాబునాయుడు వంటి అవినీతిపరుడు లేడని విమర్శించారని, ఇప్పుడు ఆ పార్టీతోనే పొత్తులు పెట్టుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. జైలులో ఉన్న చంద్రబాబుకు కోర్టులు పలు వెసులుబాటు కల్పించాయని, ఆయన్ని చంపాల్సిన అవసరం వెన్నుపోటు చరిత్ర కలిగిన ఆయన కుటుంబ వ్యక్తులకే ఉంటుంది తప్ప మరెవరికీ లేదన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి నవరత్నాలు ద్వారా లబ్ధి చేకూరుస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. విద్యతోనే కుటుంబాలు ఆర్థికంగా మెరుగుపడతాయనే ఉద్దేశంతో ప్రభుత్వం విద్యాభివృద్ధికి గణనీయంగా తోడ్పడుతుందన్నారు. పేదవాడికి కూడా కార్పొరేట్‌స్థాయి వైద్యం ఉచితంగా అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. 2024 ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

సుధీర్ మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి..

• జిల్లా ఎస్పీకి ముగ్గురు బాధితుల ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): కావలిలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన దేవరకొండ సుధీర్ అలియాస్ అజయ్‌రెడ్డి, అతని అనుచరుల మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తమను ఏమి చేస్తారోనని నిన్నమొన్నటి వరకు అతని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకురాలేదు. ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి ప్రకటనతో జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బాధితులు సుధీర్ మోసాలపై ఫిర్యాదు చేసేందుకు ముందుకొస్తున్నారు. సోమవారం నగరంలోని ఉమేష్‌చంద్రా మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన స్పందనలో ముత్తుకూరు మండలం ఈపూరు వెంకన్నపాళెం, విజయవాడ, గుంటూరుకు చెందిన ముగ్గురు బాధితులు ఎస్పీని కలిసి తమకు న్యాయం చేయాలని అభ్యర్థించారు. స్పందించిన ఎస్పీ తగిన చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల పోలీసు అధికారులను ఆదేశించారు.

రూ.15 లక్షలు కాజేశారు

– వీ ప్రవీణ్‌కుమార్, విజయవాడ

కావలి జనతాపేటకు చెందిన దేవరకొండ సుధీర్ అలియాస్ అజయ్‌రెడ్డి, అతని అనుచరులు శ్రీకాంత్, నాయక్ మార్కెట్ ధర కన్నా తక్కువ ధరకే బంగారం ఇస్తామని నమ్మబలికారు. చెల్లెలు వివాహానికి ఉపయోగపడుతుందని ఆశపడి ఏడాది కిందట రూ.15 లక్షలు వారికిచ్చాను. మరుసటి రోజు బంగారం ఇస్తామని నమ్మించి మోసగించారు. నగదు ఇవ్వమని అడిగినా ఇవ్వకుండా బెదిరింపు చర్యలకు దిగారు. ఈ దిగులుతోనే నా తల్లి మృతి చెందింది. చెల్లెలు వివాహం ఆగిపోయింది. విచారించి న్యాయం చేయండి.

నమ్మించి రూ.45లక్షలు కాజేశారు

–ప్రీతి సృజన, గుంటూరు

మాది తూర్పుగోదావరి జిల్లా. ప్రస్తుతం మా కుటుంబం గుంటూరులో ఉంటోంది. మా బంధువైన రాము రెండేళ్ల కిందట మా ఇంటికి వచ్చాడు. తనకు పాత బంగారం ఎక్కువ మొత్తంలో అమ్మేవారు తెలుసునని చెప్పి కావలికి చెందిన దేవరకొండ సుధీర్‌తో ఫోన్‌లో మాట్లాడించాడు. తనకు నగదు చాలా అవసరమని అందుకే కేజీ రూ.30 లక్షలకు విక్రయిస్తున్నానని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మి రూ.30 లక్షలు కావలిలో సుధీర్‌కు ఇచ్చాను. బంగారం ఒంగోలులో తెలిసిన వారివద్ద ఉందని ఫోన్ నంబర్ ఇచ్చారు. అక్కడకు వెళ్లి ఫోన్‌చేయగా అర్ధరాత్రి దాటిందని మరుసటిరోజు ఇస్తామని చెప్పి మోసం చేశారు. కావలికి వెళ్లి సుధీర్‌ను నిలదీయగా ఒక కేజీ ఇవ్వడం కుదరదని, మరో రూ.15లక్షలు ఇస్తే రెండు కేజీలు ఇస్తానని చెప్పాడు. నగదు వెనక్కి ఇవ్వాలంటే పదిహేను రోజులు పడుతుందని చెప్పడంతో చేసేది లేక రూ.15 లక్షలు ఇచ్చాం. అనంతరం చెన్నైలో బంగారం ఇస్తామని తీసుకెళ్లి అక్కడ ఓ మనిషిని అప్పగించి అతని వద్ద 4 కేజీల బంగారం ఉందని విజయవాడలో మీకు రెండు కేజీలు, ఇంకొకరికి మిగిలినది ఇస్తారని నమ్మబలికి పినాకిని రైలు ఎక్కించారు. ఒంగోలులో మాతో ఉన్న వ్యక్తి రైల్లో సిగిరెట్ తాగడంతో రైల్వే పోలీసులు పట్టుకుని వెంట తీసుకెళ్లారు. రైలు టికెట్లు అతని వద్దనే ఉండడంతో మేము రైలుదిగి చుట్టుపక్కల గాలించగా కనిపించలేదు. తీరా ఒంగోలులోని సీసీ ఫుటేజ్‌లు పరిశీలించగా సుధీర్ తన పీఏ మనోహర్‌రెడ్డి, మా బంధువు రవి, మరికొందరితో కలిసి ఓ పథకం ప్రకారమే రైల్వే పోలీసుల ముసుగులో మమ్మల్ని మోసగించారని అర్థమైంది. అప్పట్నుంచి అతనికి ఫోన్ చేస్తున్నా పట్టించుకోవడం లేదు. విచారించి న్యాయం చేయండి.

చంపుతామని బెదిరిస్తున్నారు

–చిన్న అంజేలు, ఈపూరు వెంకన్నపాళెం

నేను చేపల వ్యాపారిని. 2017లో వ్యాపార నిమిత్తం రూ.47 లక్షలకు చేపలను కావలికి చెందిన సుధీర్ అనుచరుడు శేఖర్‌కు ఇచ్చాను. దానికి రూ.30 లక్షలు ఇచ్చాడు. ఇంకా రూ.17 లక్షలు రావాల్సి ఉండగా పెద్దల సమక్షంలో రూ.10 లక్షలు ఇస్తానని రూ.100 స్టాంప్ పేపర్‌పై రాసి ఇచ్చాడు. సంవత్సరాలు గడుస్తున్నా నగదు ఇవ్వకపోవడంతో గతేడాది అతని ఇంటికి వెళ్లి అడుగగా చంపుతానని తుపాకీతో బెదిరించాడు. వేరే వారి ద్వారా ప్రయత్నించగా రూ.3.5 లక్షలు ఇచ్చాడు. మిగిలిన డబ్బులు ఇవ్వకుండా బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నాడు. సదరు శేఖర్ ఇటీవల ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన ఘటనలో నిందితుడు. విచారించి తగిన చర్యలు తీసుకొని న్యాయం చేయండి.

అంతర్ కళాశాలల పోటీలు ప్రారంభం


క్రీడాకారులతో వ్యాయామ అధ్యాపకులు

ఆత్మకూరురూరల్: విక్రమ సింహపురి వర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల కబడ్డీ, చెస్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఎస్సార్‌జే డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కబడ్డీ సెమీఫైనల్స్‌లో కావలి జవహర్ భారతి కళాశాల జట్టుపై ఆత్మకూరు ఎస్సార్‌జే డిగ్రీ కళాశాల జట్టు గెలిచి ఫైనల్‌కు చేరుకుంది. అలాగే మరో సెమీఫైనల్స్‌లో నెల్లూరు జగన్స్ కళాశాల జట్టుపై కావలి శ్రీసాయి కళాశాల జట్టు గెలిచి ఫైనల్‌కు చేరుకుంది. మంగళవారం ఎస్సార్‌జే డిగ్రీ కళాశాలలో ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు వ్యాయామ అధ్యాపకుడు సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. తొలుత పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు వర్సిటీ అబ్జర్వర్ మాల్యాద్రి, ప్రిన్సిపల్ రాధాకృష్ణయ్య, వర్సిటీ స్పోర్ట్స్ కార్యదర్శి సునీత, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, పీడీ ప్రసాద్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

ఉద్యాన, పాడి పరిశ్రమల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, పక్కన కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట


–డీఏఏబీ చైర్మన్ డీ నిరంజన్‌బాబురెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో వ్యవసాయ రంగంతో పాటు ఉద్యాన, పాడి పరిశ్రమల అభివృద్ధిపైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ హాల్లో నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రబీ సీజన్‌కు సాగునీటి విడుదలపై సాగునీటి సలహా మండలి సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలో రబీ సీజన్ ప్రారంభమైనందున వ్యవసాయాధికారులు ముందస్తుగా ప్రణాళికలు రూపొందించుకుని రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో చిరుధాన్యాలు, కొబ్బరి సాగును ప్రోత్సహించాలన్నారు. పాడిపరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావ పరిస్థితులతో 59 శాతం మేర తక్కువగా వర్షపాతం నమోదైనందున రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన సాగునీరు అందించేందుకు వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల అధికారులు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. కందుకూరు డివిజన్ పరిధిలో పాడి పశువుల సంఖ్య గణనీయంగా తగ్గుతోందని, ఈ విషయంపై పశు సంవర్ధకశాఖ అధికారులు అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జేసీ రోణంకి కూర్మనాథ్ మాట్లాడుతూ జిల్లాలోని రైతాంగ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రబీకు సాగునీటి విడుదలపై త్వరలో జరగబోయే ఐఏబీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. రేషనైజేషన్‌లో భాగంగా విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లను సర్దుబాటు చేస్తామని తెలిపారు. అనంతరం క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీస్‌పై శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. వ్యవసాయ ఉత్తమ క్షేత్ర విస్తరణాధికారిగా జాతీయస్థాయిలో అవార్డు పొందిన ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్‌ను శాలువాతో సత్కరించారు. హార్టికల్చర్ వర్సిటీ బోర్డు మెంబరు చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ సీడ్ బోర్డు మెంబర్ కోటా చంద్రశేఖర్‌రెడ్డి, జేడీఏ సుధాకర్‌రాజు, జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎంవీ సుబ్బారెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్, జిల్లా సహకార శాఖ అధికారి సుధాభారతి, నాబార్డు డీడీఎం రవిసింగ్, మార్క్‌ఫెడ్ డీఎం పవన్, ఏపీఎం ఐపీ పీడీ శ్రీనివాసులు, మార్కెటింగ్ శాఖ ఏడీ అనితాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మధరలు (కిలో)
పెద్దవి: రూ. 65
సన్నవి: రూ. 30
పండ్లు: రూ. 7

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు
బ్రాయిలర్: రూ.125
లేయర్ రూ.113
బ్రాయిలర్ చికెన్: రూ.220
స్కిన్‌లెస్ చికెన్: రూ.242
లేయర్ చికెన్ : రూ.192

ఈవీఎంల పరిశీలనను త్వరగా పూర్తి చేయాలి


ఈవీఎంల పరిశీలన కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు రూరల్: రాబోయే ఎన్నికలకు సంబంధించి ఈవీఎంల పరిశీలనను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలోని నెల్లూరు ఆర్డీఓ కార్యాలయ ఆవరణంలోని గోదాము వద్ద జరుగుతున్న ఈవీఎంల పరిశీలన కార్యక్రమాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంల పరిశీలకులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. వచ్చే నెల 10లోగా పరిశీలన పూర్తి చేయాలన్నారు. 10న మాక్ పోలింగ్‌డే నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్లమెంట్‌కు సంబంధించిన తనిఖీ పూర్తయిన ఈవీఎంలను కొత్త గోదాములో మంగళవారం ఉదయం భద్రపరచాలని సూచించారు. గోదాము వద్ద గట్టి భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈవీఎంల పర్యవేక్షణాధికారి ఓబులేసు, నెల్లూరు ఆర్డీఓ మలోల, తదితరులు పాల్గొన్నారు.



విశిష్ట గాయని రావు బాలసరస్వతీదేవి వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం అందుకోనున్న సందర్భంగా...

గాన సరస్వతి

పువ్వుకు రాగం అబ్బితే ఎలా ఉంటుంది?
ఆ పువ్వు స్వరాన్ని ఎలా సవరించుకుంటుంది?
ఆ తావి గానాన్ని ఎలా శ్రుతి చేసుకుంటుంది?
అక్షరాలను పూలరెక్కల్లా పొదివి పట్టుకుంటుంది.
సరిగమలు కందకుండా సున్నితంగా గానం చేస్తుంది.
ఆ గాన సరస్వతి... మన రావు బాలసరస్వతీదేవి.

పువ్వు పాడితే ఎలా ఉంటుందో... రావు బాల సరస్వతీదేవి పాట వింటే తెలుస్తుంది. హైదరాబాద్, మణికొండలోని గాయత్రి ప్లాజాలో ఆమె ఫ్లాట్ గోడలు ఆ గానసరస్వతి రాగాలను నిత్యం వింటుంటాయి. తొంభై ఐదేళ్ల వయసులో కూడా ఆమె స్వరంలో రాగం శ్రుతి తప్ప లేదు. తొంభై ఏళ్లగా సాగుతున్న సాధనతో ఆ స్వరం అద్దుకున్న తియ్యదనం అది. పారిజాత పువ్వులాంటి మృదుత్వం ఆమె రాగానిది. ఆ గొంతు సన్నజాజి మొగ్గలా పరిమళం వెదజల్లుతోందిప్పటికీ. ఆ సుమధుర గానాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. తొమ్మిది దశాబ్దాల ఆమె సంగీత సేవను గౌరవిస్తోంది. నవంబర్ ఒకటవ తేదీన (రేపు) ఆమె వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం అందుకోనున్నారు.



● పాట రికార్డింగ్ సమయంలో ఆరేళ్ల బాల సరస్వతీదేవి

గ్రామఫోన్ నుంచి సీడీల వరకు

సరస్వతి నాలుగవ ఏట నుంచి వేదికల మీద పాడుతున్నారు. ఆరవ ఏట హెచ్.ఎం.వి కంపెనీ ఆమె పాటను గ్రామఫోన్‌లో రికార్డు చేసింది. తెలుగు సినిమాలో తొలి నేపథ్య గాయనిగా రికార్డు ఆమెదే. ఆకాశవాణి కేంద్రాలు మద్రాసు, విజయవాడ స్టేషన్‌ల కోసం ప్రారంభగీతం పాడిన రికార్డు కూడా ఆమెదే. తెలుగు, తమిళ, కన్నడ భాషలతోపాటు సింహళ గీతాలనూ ఆలపించారు. బాలనటిగా, బాల గాయనిగా సినీరంగం ఆమెను గారం చేసింది. పేరు ముందు 'బాల'ను చేర్చింది. కర్ణాటక సంగీతం, హిందూస్థానీ సంగీతాలు సాధన చేసింది. సినిమా షూటింగ్‌ల కారణంగా స్కూలుకెళ్లడం కుదరకపోవడంతో ఆమె చదువు కోసం ట్యూటర్ ఇంటికి వచ్చి పాఠాలు చెప్పేవారు. ఆమెకు ఇంగ్లిష్ నవలలు చాలా ఇష్టం. ఆ అలవాటును ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. గ్రామఫోన్ రికార్డుల కాలం నుంచి క్యాసెట్ టేప్‌లో రికార్డ్ చేసే టెక్నాలజీని చూశారు. సీడీలు, ఎంపీత్రీలనూ చూశారు. టెక్నాలజీతోపాటు అప్‌డేట్ అవుతూ వచ్చారు. కానీ, సినిమా సంగీతం, సాహిత్యంలో వచ్చిన భాషాపరంగా విలోమమవుతున్న ప్రమాణాలను అంగీకరించలేకపోయారు. సినిమా అంటే శక్తిమంతమైన వినోదసాధనం. పిల్లలు, యువతకు మానసిక వికాసం, మేధో వికాసంతోపాటు వాళ్ల అభివృద్ధికి... వినోదం అనే సాధనంతో బాటలు వేసే గొప్ప కళామాధ్యమంగా ఉండాలి సినిమా. అంతే తప్ప విలువలను దిగజార్చుకునే సాధనం కాకూడదని చెబుతారామె. రెండు వేలకు పైగా పాటలు పాడిన ఈ సంగీత సరస్వతి ఈ రోజుల్లో పాటల సాహిత్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

సినిమాలకు మాత్రమే దూరం... స్వరానికి కాదు!

పెళ్లి తర్వాత పదిహేనేళ్లకు బాల సరస్వతీదేవి సినిమాల కోసం పాడడం మానేశారు. కానీ సంగీత సాధన మాత్రం ఆపలేదు. సినారె తెలుగులోకి అనువదించిన మీరాభజన్ గీతాలను ఆలపించారామె. ఎనభై ఏళ్ల వయసులో ఆమె తనకిష్టమైన కొన్ని లలిత గీతాలను ఎంచుకుని స్వీయ సంగీత దర్శకత్వం వహించి 'రాధా మాధవం' సీడీ విడుదల చేశారు. కోవిడ్‌కి ముందు 2018లో అంటే ఆమె తొంబయ్యేళ్ల వయసులో 'స్వరాభిషేకం' కార్యక్రమంలో పాడడమే ఆమె చివరి వేదిక. ఆ వేడుక తర్వాత మూడవ రోజు ఇంట్లో జరిగిన ప్రమాదం ఆమెను ఇంటికే పరిమితం చేసింది. అయితే ఆశ్చర్యంగా జారి పడడంతో విరిగిన తుంటి ఎముక దానంతట అదే సరయింది. సంగీతమే తనను స్వస్థత పరిచిందంటారామె. ఇప్పటికీ రోజూ ఆ స్వరం రాగాలను పలుకుతుంటుంది. ఆమె ఊపిరితిత్తులకు శక్తినిస్తున్నది సంగీతమేనని వైద్యులు కూడా నిర్ధారించారు.



● భర్త, పిల్లలతో బాలసరస్వతీ దేవి

పాట కలిపింది ఇద్దరినీ!

చెన్నై (మద్రాసు) లో పుట్టి పెరిగిన బాల సరస్వతి పెళ్లి తర్వాత కోడలిగా కోలంక జమీందారీలో అడుగుపెట్టారు. ప్రకృతి ఇద్దరు వ్యక్తులను దూరం చేసిన విషాదాంతాలను సినిమాల్లో చూస్తుంటాం. కానీ ప్రకృతి ఇద్దరు మనుషులను దగ్గర చేయాలనుకుంటే చాలా చమత్కారంగా దగ్గర చేస్తుంది. అందుకు ఈ గానసరస్వతి పెళ్లే గొప్ప ఉదాహరణ. ''నా పాటను వినడానికి స్వయంగా కోలంక జమీందార్... శ్రీ రాజారావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావు గారు మద్రాసులో మా ఇంటికి వచ్చారు. నేనప్పుడే 'కలువ రేకుల కనులు గల నా స్వామీ' అనే పాట రికార్డింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాను. మా నాన్న పాట పాడమనగానే అదే పాట పాడాను. రాజా వారేమో తన పెద్ద కళ్లను వర్ణిస్తూ, వారి మీద ప్రేమను అలా పాట రూపంలో వ్యక్తం చేశాననుకున్నారట. అదే మా పెళ్లికి నాందీ గీతం' అంటూ ఆనాటి జ్ఞాపకాన్ని సంతోషంగా గుర్తు చేసుకున్నారామె. అందుకే తనకు ఇష్టమైన ప్రదేశం మద్రాసేనని చెబుతారామె.

ఈ బాల రెండో బాల్యమిది!

బాలసరస్వతీ దేవికి హాఫ్ వైట్ పట్టు చీరలిష్టం. క్రీమ్ కలర్‌తో అనేక రంగుల కాంబినేషన్‌లలోనే ఎక్కువగా కనిపిస్తారు. ఆమెకు మల్లెలన్నా ఇష్టమే. ఇక స్వీట్స్... ముఖ్యంగా గులాబ్ జామూన్, జాంగ్రీలను చూస్తే చిన్న పిల్లయిపోతారు. చాక్లెట్ చేతికిస్తే పసి పిల్లల ముఖం వికసించినట్లే ఆమె ముఖంలో నవ్వులు పూస్తాయి. భోజనం గుప్పెడే కానీ, ఆ వెంటనే స్వీట్ తినడం ఆమె కిష్టం, ఆ తర్వాత తియ్యగా పాడడం మరింత ఇష్టం. ఆ సరిగమల వారసత్వం ఇద్దరు కొడుకులకు రాలేదు, మనుమడు, మనుమరాలికీ రాలేదు. కానీ మనుమరాలి కూతురు నేహకు వచ్చింది. గానసరస్వతి కళ్ల ముందే ఆ ఇంట్లో సరిగమల కొత్తతరం వెల్లివిరుస్తోంది. తొంభై ఐదేళ్ల వయసులో హైదరాబాద్‌లోని పెద్ద కుమారుని ఇంటిలో ప్రశాంతంగా పసిబిడ్డలా జీవిస్తున్నారు బాల సరస్వతీదేవి. కన్నతల్లిని 'కన్నక్కా' అని పిలుస్తూ తల్లిని కన్నబిడ్డలా చూసుకుంటున్నారాయన. కోడలు అత్తగారి చిన్నప్పటి జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ గుర్తు చేసుకుంటూ ఆమెను అపురూపంగా చూసుకుంటున్నారు. సాక్షి ఇంటర్వ్యూలో ఆమె కొన్ని సంగతులు చెప్తూ మధ్యలో మర్చిపోతుంటే ఆమె పెద్ద కొడుకు, పెద్ద కోడలు అందుకుని పూర్తి చేయడమే అందుకు నిదర్శనం.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: మోహనాచారి

మల్టీ టాలెంట్



● బిజినెస్ లీడర్‌గా...

తేజో చంద్రిక

ఆరోజు... 'అలాగే' అని తల ఆడించి ఉంటే 'పవర్ ఫుల్ ఉమన్'గా ప్రపంచ వ్యాప్తంగా చంద్రిక పేరు తెచ్చుకునేది కాదు.

'ఉద్రిక్త పరిస్థితులు ఉన్న ఈ ఊళ్లో ఒక్కరోజు కూడా ఉండలేను' అని భయపడి ఉండే ఉద్యోగజీవితంలోకి వచ్చేది కాదు. తనను తాను నిరూపించుకునేది కాదు.

'లాయర్ కావాలనుకున్నాను. ఈ ఉద్యోగం ఏమిటి' అని నిట్టూర్చి ఉంటే చంద్రిక కొత్త శిఖరాలు అధిరోహించేది కాదు.

'ఉద్యోగ జీవితానికే టైమ్ లేదు. ఇక సంగీతానికి స్థానం ఎక్కడ' అని సర్దుకుపోయి ఉంటే సంగీత ప్రపంచంలో తనదైన పేరు తెచ్చుకునేది కాదు. ప్రపంచ గుర్తింపు పొందిన బిజినెస్ లీడర్, గ్రామీ–నామినేట్ ఆర్టిస్ట్‌గా, దాతగా ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తుంది చంద్రిక....

'**అ**వసరం లేదు' ఒక మాటలో తేల్చేసింది అమ్మ. మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో డిగ్రీలో చేరాలనుకుంటున్న చంద్రికకు ఆ మాట శరాఘాతం అయింది. 'ఆ కాలేజీలో తక్కువమంది మాత్రమే అమ్మాయిలు ఉన్నారు. అంతా అబ్బాయిలే' అన్నది అమ్మ. చంద్రిక చాలా సేపు అమ్మతో వాదించినా ఫలితం కనిపించలేదు.

ఇంట్లోనే నిరాహార దీక్ష చేసింది. దీంతో చంద్రిక మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో చదవడానికి తల్లి ఒప్పుకోక తప్పింది కాదు. మూడు సంవత్సరాల కాలేజీ జీవితం చంద్రిక జీవితాన్ని కీలక మలుపు తిప్పింది. సంగీతప్రపంచంతో అనుబంధానికి, సింగర్‌గా పేరు తెచ్చుకోవడానికి కారణం అయింది.

డిగ్రీలో చేరడమే కష్టం అనుకున్న చంద్రిక ఆ తరువాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ చేరడం పెద్ద విజయం. నిజానికి చంద్రికకు బిజినెస్ ప్రపంచంపై పెద్దగా ఆసక్తి లేదు. తాతలాగే లాయర్ కావాలనుకుంది. అయితే ప్రొఫెసర్ స్వామినాథన్ సూచన మేరకు బిజినెస్ స్కూల్‌లో చేరింది. మొదటి కొన్నిరోజులు చాలా కష్టంగా అనిపించింది. ఎందుకంటే సొంత ఊరు దాటి అంత దూరం రావడం అదే మొదటిసారి.

ఆ ఒంటరితనానికి దూరం కావడానికి సంగీతానికి దగ్గరైంది. చంద్రిక తొలి ఉద్యోగం సిటీబ్యాంక్‌లో. బ్యాంకర్ కావాలని కలలో కూడా అనుకోని చంద్రికకు ఇది వింతగా అనిపించింది. ట్రైనింగ్ ప్రోగ్రామ్ కోసం లెబనాన్‌లోని బీరుట్ వెళ్లింది.



● సుమధుర గాయనిగా...

యుద్ధానికి సంబంధించి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో అక్కడకు వెళ్లింది. అక్కడ అయిదు నెలల పాటు ఉంది. సిటీబ్యాంక్ తరువాత వేరే సంస్థల నుంచి చంద్రికకు అవకాశాలు రావడం మొదలైంది. అలా అమెరికాలోకి అడుగు పెట్టింది. ఉద్యోగంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ తనకు ఇష్టమైన సంగీతప్రపంచాన్ని మాత్రం చంద్రిక విడిచి బయటికి రాలేదు. ఎన్నో ఆల్బమ్స్ ద్వారా సక్సెస్‌ఫుల్ మ్యూజిషియన్‌గా తనను తాను నిరూపించుకుంది. సెకండ్ ఆల్బమ్ 'సోల్ కాల్' గ్రామీ అవార్డ్–బెస్ట్ కాంటెంపరరీ వరల్డ్ మ్యూజిక్ ఆల్బమ్ విభాగంలో నామినేట్ అయింది.


గ్లోబల్ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ మెకెంజీకి ఫస్ట్ ఇండియన్ ఉమెన్ పార్ట్‌నర్‌గా అరుదైన ఘనత సాధించింది. అడ్వైజరీ సంస్థ 'టాండన్ క్యాపిటల్స్ అసోసియేషన్స్' ప్రారంభించి సూపర్ సక్సెస్ అయింది.

ఈ ప్రయాణంలో చంద్రికకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. కుటుంబజీవితం, వృత్తి జీవితాన్ని సమన్వయం చేసుకోవడం కూడా అందులో ఒకటి. అయితే ప్రతి సవాలును అధిగమిస్తూ ముందుకు వెళ్లింది. సవాలు ముందుకు వచ్చినా, ఒత్తిడి తలలో దూరినా తన దగ్గర ఉన్న బ్రహ్మాస్త్రం సంగీతం. పాటలు వినడం, పాడడం తనకు ఎంతో ఇష్టం. అదే తన బలం. తాజాగా 'అమ్మాస్ ట్రెజరర్స్' ఆల్బమ్‌తో ముందుకు వచ్చింది చంద్రిక. ఇది పిల్లలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఆల్బమ్.

● బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్‌ఎఫ్) పెంపకంతో రైతులకు ఆదాయం, పర్యావరణానికి మేలు
● సేంద్రియ వ్యర్థాలను ప్రొటీన్లతో కూడిన ఆహారంగా మార్చుతున్న బ్లాక్ సోల్జర్ ఈగలు
● బిఎస్‌ఎఫ్ లార్వాలు (పిల్ల పురుగులు) కోళ్లకు, చేపలు, రొయ్యలకు, పెంపుడు కుక్కలకు శ్రేష్ఠమైన పౌష్టికాహారం
● 30 రోజులకో బ్యాచ్ చొప్పున బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగులను ఇంటిపట్టునే సులువుగా పెంచవచ్చు
● బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగుల పెంపకంలో ఉప ఉత్పత్తిగా వెలువడే సేంద్రియ ఎరువుతో అదనపు ఆదాయం
● దేశంలోనే మొట్టమొదటిగా తెలంగాణ వ్యవసాయ వర్సిటీలో ఐసిఎఆర్ ఎన్ఎహెచ్ఇపి ప్రాజెక్టు ద్వారా పైలెట్ యూనిట్ ఏర్పాటు
● శాస్త్రవేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతులకు శిక్షణ ఇవ్వనున్న పిజెటిఎస్ఎయు

సాగుబడి
స్వాతి కార్తె: నవంబర్ 6 వరకు

బ్లాక్ సోల్జర్ ఈగలతో ప్రొటీన్ల సేద్యం!



సేంద్రియ వ్యర్థాలను ఆహారంగా తిని పెరిగే బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్‌ఎఫ్) పిల్ల పురుగు(లార్వా)లు కోళ్లతో పాటు చేపలు, రొయ్యలకు మంచి ప్రొటీన్లతో కూడిన మేతగా ఉపయోగపడుతున్నాయి. విదేశాల్లో విస్తారంగా జరుగుతున్న బిఎస్‌ఎఫ్ లార్వా సాగు ఇప్పుడిప్పుడే మన దేశంలోనూ వ్యాపిస్తోంది. కుళ్లిన పండ్లు, కూరగాయలు, వంటింట్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలతో పాటు పశువుల పేడ, కోళ్లు, మేకలు, పందుల విసర్జితాలను తిని ఈ పిల్ల పురుగులు దాదాపు నెల రోజుల్లోనే పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. బిఎస్‌ఎఫ్‌పై పరిశోధనలు మన దేశంలో శైశవ దశలో ఉన్నాయి. ఐసిఎఆర్ గ్రాంటుతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం(పిజెటిఎస్ఎయు) ఏడాది క్రితమే వేస్ట్2వెల్త్ ప్రాజెక్టులో భాగంగా దీనిపై పరిశోధనలు చేపట్టింది. అంతేకాదు, శాస్త్రవేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతుల శిక్షణకు ఇటీవలే శ్రీకారం చుట్టింది. ఇన్నోవేటివ్ ఇన్‌సెక్ట్ ఫార్మింగ్ వివరాలతో ఆసక్తికర కథనం...

ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తయిన శాకాహార, మాంసాహారోత్పత్తుల్లో 60% మాత్రమే వినియోగమవుతోంది. పొలంలో 8%, మార్కెట్‌కు వెళ్లే దారిలో 14%, రిటైల్ అమ్మకందారుల వద్ద 7%, ఇళ్లలో వినియోగానికి ముందు 11% మేరకు ఆహారం వృథా అవుతోంది. 2021 యుఎన్‌ఇపి ఫుడ్ వేస్ట్ ఇండెక్స్ ప్రకారం మన దేశంలో ఏటా 6.88 కోట్ల టన్నుల ఆహార వ్యర్థాలు వెలువడుతున్నాయి. ఈ సేంద్రియ వ్యర్థాలను చెత్తకుప్పల్లో వేసే కంటే పునర్వినియోగించి ప్రయోజనం పొందటం తెలివైన పని. ఈ పనిని ఇతర పురుగుల కన్నా బ్లాక్ సోల్జర్ ఈగలు (బిఎస్ఎఫ్) సమర్థవంతంగా చేయగలవన్నది నిపుణుల మాట.

పురుగుల సేద్యం చాలా వినూత్నమైనది, పర్యావరణ హితమైనది, ఆదాయాన్ని అందించేది కూడా. మన దేశంలో కొందరు వ్యాపారవేత్తలు, కోళ్ల రైతులు బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పిల్ల పురుగుల(లార్వా)ను సాగు చేయటం ఇటీవల ప్రారంభించారు. బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల ఉత్పత్తి కాలం వాటికి వేసే ఆహారాన్ని బట్టి మారుతుంది. ఒక బ్యాచ్ 20 రోజుల నుంచి 40 రోజుల వరకు పడుతుంది. ఆహారం మెత్తగా, త్వరగా జీర్ణించుకునే విధంగా ఉండి ప్రొటీన్లతో కూడి ఉన్నప్పుడు తక్కువ రోజుల్లోనే పురుగులు పెరుగుతాయి.

లేయర్ కోళ్ల ఫారాల్లో ఇనుప కేజ్‌ల కింద పోగుపడే కోళ్ల పెంటపై బిఎస్ఎఫ్ ఈగల 5 రోజుల పిల్లలను వదిలితే చాలు.. ఆ వ్యర్థాలనే ఆహారంగా తింటూ 25–30 రోజుల్లోనే పిల్ల పురుగులు వృద్ధి చెందుతాయి.

బిఎస్ఎఫ్ పెంపకం ద్వారా సేంద్రియ వ్యర్థాల పరిమాణాన్ని 15–25 రోజుల్లో 70–80% మేరకు కుదించవచ్చు. అందువల్లనే నగరాలు, పట్టణాల్లో పోగుపడే సేంద్రియ వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణకు ఇవి ఉపయోగపడుతున్నాయని ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఓ) చెబుతోంది. బిఎస్ఎఫ్ లార్వా(పిల్ల పురుగులు) బరువులో 40–45% వరకు ప్రొటీన్లు ఉన్నాయి. అందువల్ల కోళ్ల మేతలో, ఆక్వా మేతల తయారీలో సోయా చిక్కుళ్లు, ఫిష్ మీల్‌తో పాటుగా 10 శాతం వరకు బిఎస్ఎఫ్ పురుగుల పొడిని కలుపుతున్నారు. బతికి ఉన్న పిల్ల పురుగుల (వెట్ లార్వా)ను కోళ్లకు నేరుగా మేతగా వేస్తున్నారు. రోజువారీ మేతలో పది శాతం వరకు ఈ పిల్ల పురుగులను అందిస్తూ సత్ఫలితాలు పొందుతున్న కోళ్ల ఫారాలు తెలుగు నాట ఇప్పటికే అనేకం ఉన్నాయి.



● బ్లాక్ సోల్జర్ ఫ్లై గుడ్లు
● 5 రోజుల వయసులో పిల్ల పురుగులు
● గ్రాములో 3 వేల పిల్ల పురుగులు
● కూరగాయ వ్యర్థాలు, చద్దన్నం, గోధుమ తవుడు మిశ్రమం
● ఆ మిశ్రమమే పురుగులకు ఆహారం
● 15–25 రోజుల్లో లార్వా సిద్ధం. ప్యూపా దశకు ముందే ఈ పురుగులను వాడుకోవాలి

పిజెటిఎస్ఎయులో పైలెట్ ప్రాజెక్టు

అయితే, మన దేశంలో దీనిపై పరిశోధనలు ఇంకా శైశవ దశలోనే ఉన్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పిజెటిఎస్ఎయు) ఈ దిశగా ముందడుగు వేసింది. దేశంలోనే మొట్టమొదటిగా బిఎస్ఎఫ్ పెంపకంపై పరిశోధన చేపట్టింది. నేషనల్ అగ్రికల్చర్ హయ్యర్ ఎడ్యుకేషన్ 'వేస్ట్2వెల్త్' ప్రాజెక్టును మంజూరు పిజెటిఎస్ఎయుకు గత ఏడాది చేసింది. పిజెటిఎస్ఎయు పీజీ స్టడీస్ డీన్, కీటక శాస్త్ర ఆచార్యులు డా. వి. అనిత ఈ ప్రాజెక్టుకు నోడల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రాజేంద్రనగర్‌లోని వర్సిటీ ఆవరణలో బ్లాక్ సోల్జర్ ఫ్లైల పెంపకం కమ్ శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పారు. కూరగాయలు, పండ్ల వ్యర్థాలు, మెస్‌లో మిగిలిన అన్నం, గోధుమ తవుడు మిశ్రమంతో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులు పెంచుతున్నారు. పరిశోధక విద్యార్థులు పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

ఈ నేపథ్యంలో, కృషి విజ్ఞాన కేంద్రాల్లోని శాస్త్రవేత్తల మొదటి బ్యాచ్‌కు డా. అనిత ఇటీవలే శిక్షణ ఇచ్చారు. ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతులకు కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు డా. అనిత 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. నగరాలు, పట్టణాల్లో వెలువడే సేంద్రియ ఆహార వ్యర్థాల కాలుష్యాన్ని తగ్గించడానికి, పనిలో పనిగా మంచి ప్రొటీన్‌ను అందుబాటులోకి తెచ్చుకోవడానికి బిఎస్ఎఫ్ లార్వాల పెంపకం ఉపయోగకరం. అన్నిటికీ మించి, సేంద్రియ వ్యర్థాల పరిమాణాన్ని 15–25 రోజుల్లోనే 70–80% మేరకు తగ్గించేంత ఆబగా తినగల శక్తి బిఎస్ఎఫ్ జాతికి వుంది. బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకానికి మన దేశపు వాతావరణం చాలా అనువైనదంటున్నారు డా.అనిత.



● బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను వర్టికల్ టవర్‌లో ట్రేలలో పెంచవచ్చని చెబుతున్న డా. వి. అనిత

ఎంటర్‌ప్రెన్యూర్లకు, రైతులకు శిక్షణ ఇస్తున్నాం

బ్లాక్ సోల్జర్ ఈగలు మనకు కొత్తవి కావు. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 20వ శతాబ్దం నుంచి ఉన్నదే ఈ జాతి. కొత్త తెగుళ్లు వ్యాప్తి చెందుతాయన్న భయం లేదు. ఆహార వ్యర్థాలు, పశువుల విసర్జితాలను సాధ్యమైనంత మెత్తగా చేసి, సులభంగా జీర్ణించుకునేలా మార్చి ఈ పురుగులకు వేయాలి. అందులో ప్రొటీన్లు ఉండాలి. చిన్న పిల్లల ఆహారం లాగా ఉండాలి. కూరగాయలు, పండ్ల వ్యర్థాలను సేకరించి, మెత్తగా రుబ్బి.. దానితో పాటు మెస్‌లో మిగిలిపోయిన అన్నం, గోధుమ తవుడు కొంచెం కలిపి మా ప్రయోగశాలలో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను పెంచుతున్నాం. వాటికి వేసే ఆహారాన్ని బట్టి, దానిలో పోషక విలువలను బట్టి, వాతావరణంలో వేడి, గాలిలో తేమను బట్టి.. అవి ఎన్ని రోజుల్లో, ఎంత బరువు పెరుగుతాయన్న విషయం ఆధారపడి ఉంటుంది. సేంద్రియ వ్యర్థాలను సమర్థవంతంగా నాణ్యమైన సేంద్రియ ఎరువుగా మార్చుకునే మార్గం ఇది. పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. మంచి ఆదాయమూ సమకూరుతుంది. రైతులకు, ఎంటర్‌ప్రెన్యూర్లకు శిక్షణ ఇస్తున్నాం.

– డా. వి. అనిత, కీటక శాస్త్ర ఆచార్యులు, పీజీ స్టడీస్ డీన్,
బ్లాక్ సోల్జర్ ఫ్లై ప్రాజెక్టు నోడల్ ఆఫీసర్, పిజెటిఎస్ఎయు, హైదరాబాద్. మొబైల్: 94402 58050

బిఎస్ఎఫ్ ప్రత్యేకతలు

సేంద్రియ వ్యర్థాలను తినే అనేక జీవులుండగా బ్లాక్ సోల్జర్ ఫ్లైలనే ఎందుకు ఎంపిక చేసినట్లు? ఇదే ప్రశ్న డా. అనితను అడిగితే ఇలా బదులిచ్చారు...

● రోజుకు తన బరువుకు రెట్టింపు సేంద్రియ వ్యర్థాలను తిని, సేంద్రియ ఎరువును విసర్జించగల శక్తి బిఎస్ఎఫ్ పిల్ల పురుగులకు ఉంది. దీని అర్థం ఏమిటంటే.. చెత్త కుప్పలకు తరలివెళ్లే సేంద్రియ వ్యర్థాలు తగ్గిపోతాయి. మిథేన్ ఉద్గారాలు ఆ మేరకు తగ్గుతాయి.

● కుళ్లిన పండ్లు/కూరగాయలు,హోటళ్లు/ఇళ్లలో మిగిలిపోయిన ఆహార పదార్థాలతో పాటు పశువుల పేడ, కోళ్లు, మేకలు, పందుల విసర్జితాలు వంటి సేంద్రియ వ్యర్థాలను బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకానికి వాడొచ్చు.

● బిఎస్ఎఫ్ జీవిత చక్రం మొత్తం 42–55 రోజులు. గుడ్లు పెట్టిన 4–5 రోజులకు పిగులుతాయి. అవి 15–25 రోజుల్లో పిల్ల పురుగులా(లార్వా)గా ఎదుగుతాయి. ఈ దశలోనే వాటిని సేకరించి కోళ్ల, ఆక్వా మేతల్లో వాడుతున్నారు. అలాగే ఉంచితే, ప్యూపాగా రూపాంతరం చెంది, 17 రోజుల తర్వాత బ్లాక్ సోల్జర్ ఈగలు పుడతాయి. మగ ఈగ 4 రోజుల్లో ఆడ ఈగను కలిసిన తర్వాత చనిపోతుంది. ఆడ ఈగ 5–8 రోజుల్లో గుడ్లు పెట్టి చనిపోతుంది.

● గుడ్లను సేకరించి, అతి చిన్న పురుగులను తయారు చేయట కొంచెం క్లిష్టమైన ప్రక్రియ. 5 రోజుల పిల్లలకు తగిన సేంద్రియ ఆహారం అందిస్తే 15–25 రోజుల్లో పిల్ల పురుగులు(లార్వా)గా పెరుగుతాయి. ఆ దశలో చక్కని ప్రొటీన్లతో కూడిన ఆ పిల్ల పురుగులు కోళ్లు, చేపలు, రొయ్యలకు మేతగా వాడుకోవచ్చు.

● 5 రోజుల పిల్లలను కొనుక్కొని రైతులు 15–25 రోజుల్లో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను లార్వా దశకు పెంచి, కోళ్లకు, చేపలు, రొయ్యలకు మేతగా వేసుకోవచ్చు లేదా కొనుగోలుదారులకు అమ్ముకోవచ్చు. స్వయం ఉపాధిగా యువకులు బిఎస్ఎఫ్ లార్వా సాగు చేపట్టవచ్చు. ఈ లార్వాను దాణా తయారీ కంపెనీలు, సంస్థలు కొనుగోలు చేస్తున్నాయి. లార్వా దశ దాటి ప్యూపా దశకు పెరిగితే దాణాల్లో వాడకానికి పనికిరాదు.

● సోయా చిక్కుళ్ల సాగులో సమస్యలు, సముద్రాల్లో చేపల సంతతి తగ్గిపోతుండటం వల్ల కోళ్లు, ఆక్వా మేతలతో పాటు, పెంపకపు కుక్కల మేతల్లో కూడా బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను ప్రొటీన్ సప్లిమెంట్‌గా ప్రపంచవ్యాప్తంగా వాడుతున్నారు. దీంతో బిఎస్ఎఫ్ లార్వా సాగుకు డిమాండ్ పెరుగుతోంది.

● ఈ పిల్ల పురుగులే అధిక నాణ్యత గల ప్రొటీన్లతో కూడిన దాణాకు ముడి పదార్థం. కోళ్లు, చేపలు, రొయ్యలు, పందులు, పెంపుడు కుక్కలకు వేసే మేతలో బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పొడిని కలపవచ్చు. పిల్ల పురుగుల బరువులో 40–45% ప్రొటీన్‌తో పాటు ఎసెన్షియల్ అమినో యాసిడ్లు ఉంటాయి. సాధారణంగా మేతల్లో ప్రొటీన్లుగా వాడే సోయా చిక్కుడు గింజలు, ఫిష్‌మీల్‌ను కొంత తగ్గించి దీన్ని వాడుతున్నారు.

● కోళ్లకు రోజువారీ మేతలో పది శాతం మేరకు దీన్ని వాడుతున్నారు. పిల్ల పురుగులను బతికి ఉన్నప్పుడే ఫారం కోళ్లకు మేపవచ్చు. నాటు కోళ్లకూ ఇది మంచి ఆహారం.

● బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకం క్రమంలో వెలువడే విసర్జితాలే(ఫ్రాస్) పంటలకు అత్యంత విలువైన సేంద్రియ ఎరువుగా పనికి వస్తుంది. వర్మీకంపోస్టు, పశువుల ఎరువుల్లో కంటే అధిక పోషక విలువలు ఇందులో ఉంటాయని చెబుతున్నారు.

● విదేశాల్లో బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పొడిని బర్గర్లు, షేక్‌లలో కలుపుతున్నారు. దీని నుంచి వెలికితీసే నూనెను బయో ఇంధనంగా వాహనాలు, జనరేటర్లలో వాడుతున్నారు. బిఎస్ఎఫ్ లార్వా నుంచి వెలువడే పొలుసులు(కూటిన్) బయోడీగ్రేడబుల్ ప్యాకేజింగ్ ప్లాస్టిక్ తయారీకి వాడుతున్నారు. యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలున్నందున వైద్య అవసరాలకు కూడా వినియోగిస్తున్నారు.

● వర్షాకాలంలో దీపం చుట్టూ చేరే ఉసుళ్లను వేపుకొని శనగపప్పుతో కలుపుకొని తినే అలవాటు మన దేశంలోనూ ఉంది. బిఎస్ఎఫ్‌తో పాటు మిడతలు, మీల్ వార్మ్స్, గొల్లభామలు, వంటి 1,900 జాతుల పురుగులను 113 దేశాల్లో 200 కోట్ల మంది తింటున్నారని ఎఫ్ఎఓ చెబుతోంది.

పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్